నేడు ప్రజావాణి

కుత్బుల్లాపూర్: గాజులరామారం కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ పరిధిలోని కార్యాలయాల్లో ఈ నెల 5న (సోమవారం) ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహులు ఆదివారం ప్రకటనలో తెలిపారు.కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ప్రజా అవసరాలకు ఉపయోగపడే ప్రతి విషయాన్ని ప్రజావాణిని దృష్టికి తీసుకురావాలని కోరారు. వచ్చిన ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం


పూజల్లో కాంగ్రెస్ నేతలు శ్రీనివాసరావు, రాఘవేంద్రగౌడ్

కుత్బుల్లాపూర్: సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లోని అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు చౌడ శ్రీనివాసరావు, ఎన్ఎస్‌యూఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కూన రాఘవేంద్రగౌడ్ హాజరై పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ నాయకుడు శ్రీనివాస్, బీజేపీ నేత ఎం.ఎస్. వాసు, గుబ్బల లక్ష్మీనారాయణ, కాలనీ అసోసియేషన్ సభ్యులు, విజయ గణపతి వెజిటేబుల్ మార్కెట్ కమిటీ సభ్యులు ఆంజనేయులు, వీరబాబు, అరుణ్, మహేశ్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న బస్తీవాసులు

కుత్బుల్లాపూర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ బస్తీల ప్రజలు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అదే విధంగా పలువులు వివిధ శుభకార్యాలకు సంబంధించి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భూపాల్

నిజాంపేట్: ఉప్పల్ జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రపంచ మేధావికి మణిహారం కార్యక్రమంలో భాగంగా 209వ ఆదివారం ఉప్పల్‌లోని నాలెడ్జి పార్క్ ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహానికి బాచుపల్లికి చెందిన బ్లూ ఇండియా పార్టీ ప్రధాన కార్యదర్శి కమ్మెట భూపాల్ జ్ఞాన పూల మాల వేశారు. కార్యక్రమానికి ప్రముఖ బౌద్ధ ఉపాసకులు తోకల సంజీవ్‌రెడ్డి, జ్ఞాన ప్రచార సభ వ్యవస్థాపక అధ్యక్షుడు నల బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గంలో యువత పయనించాలన్నారు. కార్యక్రమంలో జై భీమ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర బాలరాజు, కోశాధికారి రాపోలు రవి, ఉపాధ్యక్షులు ఏసూరి బాలపోచయ్య, నాగోల్ రమేశ్, గంధమల చంద్రశేఖర్, సాయిప్రసాద్, రామాంతపూర్ వెంకటేశ్, ఆర్టీసీ సురేశ్, బొప్పెనా శ్రీధర్, లాలపేట్ వెంకటేశ్, సలహాదారు జొన్నపల్లి క్రాంతిరాజు, బాచుపల్లి నేతలు పాల్గొన్నారు.

తెగిన ప్రధాన విద్యుత్ లైన్



సుభాష్‌నగర్: సుచిత్ర-కుత్బుల్లాపూర్ ప్రధాన రహదారిలోని వెన్నెల గడ్డ వద్ద ఆదివారం తెల్లవారుజామున ప్రధాన విద్యుత్ లైన్ తెగి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికుడు బండి అవినాష్‌గౌడ్ గమనించి సంబంధిత అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కొద్దిసేపు వాహనాలను ఆపివేసి తెగిన విద్యుత్ వైర్‌ను పక్కకు తొలగించారు. కానీ సంబంధిత అధికారులు ఆదివారం వరకు కూడా ఆ లైన్‌ను పునరుద్ధరించకుండా అలాగే వదిలేశారు.

లారీ డ్రైవర్ అజాగ్రత్త


ప్రమాదంలో ధ్వంసమైన కారు

జీడిమెట్ల: లారీ డ్రైవర్ అజాగ్రత్తగా రివర్స్ తీస్తూ వెనుక వస్తున్న కారును ఢీకొట్టడంతో కారులోని నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలపిన వివరాల ప్రకారం.. సాయిబాబానగర్‌కు చెందిన నవీన్, భాను, ప్రసాద్, మోహన్ ఆదివారం ఉదయం స్విఫ్ట్ కారులో సుభాష్‌నగర్ నుంచి సాయిబాబానగర్ వైపు వెళ్తున్నారు. గతి ట్రాన్స్‌పోర్ట్ వద్దకు చేరుకోగానే ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన లారీ కంటైనర్ డ్రైవర్ అజాగ్రత్తగా రివర్స్ తీస్తూ కారును ఢీకొట్టడంతో అందులోని నలుగురు గాయపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెస్ టోర్నమెంట్

ఆల్విన్‌కాలనీ: ప్రత్యూష ఇంటర్నేషనల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హెచ్ఎంటీ హిల్స్ కమిటీ హాల్‌లో చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. 7 సంవత్సరాల నుంచి 9, 11 సంవత్సరాలు, ఉత్తమ మహిళా కేటగిరిల్లో పోటీలు జరిగాయి. మొత్తం 80 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతి విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు, ట్రోఫీ, మెడల్‌ను నిర్వాహకులు అందజేశారు. బహుమతులను ఉమెన్ గ్రాండ్ మాస్టర్ ప్రత్యూష బొడ్డ చేతుల మీదుగా అందజేశారు.

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ..!

- పాదచారులు, వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ఇష్టారాజ్యంగా దుకాణాల ఏర్పాటు, వాహనాల పార్కింగ్


ఐడీపీఎల్ చౌరస్తా సమీపంలో రోడ్డుపైనే నిలిపిన ప్రైవేట్ బస్సులు


గాజులరామారం రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆటోల రిపేరు

చింతల్: గ్రేటర్ సుందరీకరణలో భాగంగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు, రోడ్ల విస్తరణ ప్రాంతాలను పలువురు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. వీటిపై సంబంధిత అధికారుల నియంత్రణ లేకపోవడం కొంతైతే... అక్రమ పార్కింగ్, దుకాణదారులకు రాజకీయ నేతల అండదండలు సైతం ఉండడంతో తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదాచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రజాధనం వృథా..

ఐడీపీఎల్ చౌరస్తా నుంచి జగద్గిరిగుట్ట వరకు రోడ్డుకిరువైపులా అక్రమంగా వ్యాపారాలు వెలిశాయి. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి నెహ్రూనగర్ దావద్ బస్తీ జిషాన్ హోటల్ వరకు రూ. కోటి 90 లక్షలతో రోడ్డు విస్తరణతో పాటు మరిన్ని నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టగా అది కూడా అక్రమ వ్యాపారాలకు అడ్డాలుగా మారాయి. అధికారులు గతంలో పలుమార్లు ఫుట్‌పాత్‌పై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను మూసివేశారు. కానీ సాయంత్రం వరకే మళ్లీ సదరు అక్రమ దుకాణదారులు తమ వ్యాపారాలు కొనసాగించారు. అదేవిధంగా ఐడీపీఎల్ చౌరస్తా నుంచి బాలానగర్‌కు వెళ్లే దారిలో ఉన్న ఫుట్‌పాత్ ఏకంగా బస్సులు, కార్లకు అడ్డాగా మారింది. అధికారులు తిరిగే ఈ ప్రధాన రోడ్డుపైనే అక్రమంగా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నా.. వాటిపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అదేవిధంగా గాజులరామారం చౌరస్తా నుంచి సీతారామ టెంపుల్ వరకు వేసిన ఫుట్‌పాత్‌పై కొంతమంది మెకానిక్‌లు వాహనాల మరమ్మతులు చేపడుతున్నారు.

అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మోడ్రన్ కల్యాణ మండపం..

చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సుమారు రూ. 4.50 కోట్లతో మోడ్రన్ కల్యాణ మండపం నిర్మించారు. దానికి ఎదురుగా స్థానికంగా ఉండే కొంతమంది రాజకీయ పలుకుబడిని ఉపయోగించి రోడ్డుకు అడ్డంగా తమ వాహనాలను నిలిపివేస్తున్నారు. కొన్నింటిని నెలలు తరబడి అక్కడే పార్కింగ్ చేస్తుండడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


షాపూర్‌నగర్ వాటర్‌వర్క్స్ కార్యాలయం సమీపంలో..

గల్లీల్లో ఇష్టారాజ్యంగా పార్కింగ్..

చింతల్ డివిజన్ చంద్రనగర్‌లో కొంతమంది ద్విచక్ర వాహనాలను రోడ్లపైనే పార్కు చేస్తున్నారు. దీంతో ఇతర వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ వాహనాలతో పాటు గ్యాస్, అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.


భగత్‌సింగ్‌నగర్‌లోని ఓ గల్లీలో..

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి


షాపూర్‌నగర్ మార్కెట్‌లో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

రంగారెడ్డినగర్: కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి వరదతో నష్టపోయిన బాధితులను ఆదుకుందామని కుత్బుల్లాపూర్ సీపీఎం కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లో ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బీభత్సంలో అనేక గ్రామాలు నామరూపాలు లేకుండా పోయాయని, వందలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అలాగే పౌరులు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. సభ్యులు సత్యం, శంకర్, రావుల స్వాతి, సీఐటీయూ నాయకులు శీను, కరుణాకర్, మల్లారెడ్డి, కృష్ణ, ఏసు, పాషా పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం నలుగురికి రూ.1.25 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్, కాశీనాథ్ యాదవ్, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, మంజుల, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో భారీ వర్షం


భాగ్యలక్ష్మీ కాలనీ ప్రధాన రోడ్డుపై నిలిచిన వరద

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో బస్తీలు, కాలనీలు వరదతో జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయోధ్యనగర్‌లోని పలు ఇండ్లలోకి వరద చేరడంతో నీటిని బయటకు తోడేందుకు నానా అవస్థలు పడ్డారు.

జీడిమెట్ల డివిజన్‌లో..

సుభాష్‌నగర్: జీడిమెట్ల డివిజన్ భాగ్యలక్ష్మీ కాలనీ ప్రధాన రోడ్లపై వరద నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వర్షం పడినప్పుడల్లా ఈ సమస్య తలెత్తుతుందని, సంబంధిత అధికారులు దృష్టి సారించి వరద రోడ్డుపై నిలవకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తల్లిదండ్రుల చెంతకు బాలుడు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్

నిజాంపేట్: తప్పిపోయిన బాలుడిని గంటల వ్యవధిలో బాచుపల్లి పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం నిజాంపేట్ కేటీఆర్ కాలనీకి చెందిన వీరాబాబు కుమారుడు కార్తీకేయ (6) ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కొన్ని గంటల్లోనే బాలుడి ఆచూకీని తెలుసుకుని రాత్రి సుమారు 9 గంటల సమయంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు


శాకాంబరి అలంకరణలో కాళికామాత


జగద్గిరిగుట్ట బస్టాప్‌లో దుర్గామాత


సోమయ్యనగర్‌లోని పోచమ్మ అమ్మవారు..


పోచమ్మ ఆలయం వద్ద అన్నదానంలో కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: అమావాస్య పూజల్లో భాగంగా డివిజన్ పరిధిలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు.

కాళికామాత ఆలయంలో..

జగద్గిరిగుట్ట కొండపైనున్న శ్రీ కాళికామాత అమ్మవారు శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

దుర్గామాత ఆలయంలో..

జగద్గిరిగుట్ట బస్టాప్ సమీపంలోని దుర్గామాత ఆలయంలో అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో..

సోమయ్యనగర్‌లోని పోచమ్మ, భూదేవి హిల్స్‌లోని పెద్దమ్మ ఆలయాల్లో గత వారం జరిగిన బోనాల పండుగ సందర్భంగా భక్తులు సమర్పించిన ఒడి బియ్యంతో అన్నదానాలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జగన్ హాజరై పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. అలాగే మగ్దూంనగర్, మైసమ్మనగర్ బొడ్రాయిల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


మగ్దూంనగర్ బొడ్రాయి వద్ద..

భగత్‌సింగ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద..

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ గుజ్జల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్, ఉప్పలయ్య, సహదేవ్, ప్రధాన కార్యదర్శి సాంబయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మైసమ్మ నగర్ బొడ్రాయి వద్ద..


భగత్‌సింగ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద..

ఎంపీ ఈటలను కలిసిన దళిత సంఘాల నేతలు


మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు

కుత్బుల్లాపూర్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నేతలు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈటల రాజేందర్ మొదటి నుంచి ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపారన్నారు. మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పాటు కొనసాగించిన పోరాట ఫలితంగా వర్గీకరణ కల సాకారమైందన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి కేశపాగ రామచందర్‌మాదిగ, అశోక్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్‌మాదిగ, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శివ, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి సిలవేరు శ్రీనివాస్‌మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరిమాదిగ, జిల్లా మాదిగ యువసేనా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పరశురాం, రమేశ్ మాదిగ, కురుమయ్య, సంఘీ మహేశ్, గడ్డం కురుమయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు నడిమీదొడ్డి సలోమి ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ, శరీర దృఢత్వం


మార్షల్స్ ఆర్ట్స్‌లో పతకాలు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కరాటేతో ఆత్మరక్షణతో పాటు శరీర దృఢత్వం పెంపొందుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఇటీవల నగరంలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ -2024 పోటీల్లో కుత్బుల్లాపూర్‌కు చెందిన బుడోకాయ్ మార్షల్ ఆర్ట్స్ దూ ట్రెనింగ్ స్కూల్ విద్యార్థులు 30 బంగారు, 20 రజత పతకాలు సాధించారు. దీంతో మాస్టర్ కామేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విజేతలు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గోల్డ్ మెడల్ సాధించిన వందన, లాస్య, సిద్దు, రోషన్, మోనిషా, మోక్షజ్ఞులు, ఏడేళ్లలోనే బంగారు పతకం సాధించిన ఇమ్మడి సోహన్‌వీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు సన్మానం..


ఎమ్మెల్యేకు మెమోంటో అందజేస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

ధూలపల్లిలోని సెయింట్ మార్టిన్ కళాశాలలో ఆదివారం నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్‌ను సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై మాట్లాడుతూ అథ్లెటిక్స్‌లో యువతను ప్రోత్సహించేందుకు నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 150 మంది అథ్లెటిక్స్‌కు నగదు ప్రోత్సాహకాన్ని అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రభు కుమార్, కోశాధికారి లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కూకట్‌పల్లి: రాఘవేంద్రనగర్ బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు కృష్ణనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో దోమలు విపరీతంగా ఉన్నాయని, కాలనీకి ఆనుకుని ఉన్న చెరువులో గుర్రపుడెక్కను తొలగించాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా శ్మశాన వాటికలో బోరు వేయించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే కాలనీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

అమ్మ పేరిట ఓ మొక్క..

- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు కార్యక్రమం షురూ
- హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ
- మొక్కలు నాటిన అధికారులు, సిబ్బంది, వలంటీర్లు

రాయదుర్గం: ఇటీవల దేశ ప్రధాని నరేంద్రమోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఒక్కరూ తమ 'అమ్మ' పేరిట మొక్కను నాటాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని 'నేషనల్ సర్వీస్ స్కీమ్' (ఎన్ఎస్ఎస్) సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఎన్ఎస్ఎస్ సెల్, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల సహకారంతో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య పర్యవేక్షణలో క్యాంపస్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు.

ఏడాది పొడవునా నిర్వహణకు నిర్ణయం..

◆ హెచ్‌సీయూ క్యాంపస్‌లో యేటా పర్యావరణ దినోత్సవం రోజుతో పాటు వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

◆ ఇప్పటినుంచి ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో ఏడాది పొడవునా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు.

◆ ఇందులో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాలే కాకుండా హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్, వైస్‌చాన్స్‌లర్లు, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది అందరినీ భాగస్వాములు చేయనున్నారు.

◆ ఏడాది పొడవునా ప్రతి శనివారం, ఇతర ముఖ్యమైన రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టానున్నారు.

◆ మొదటిసారిగా శనివారం 450 మొక్కలు నాటారు. ఇందులో మామిడి, దానిమ్మ, మందార, క్లోరోఫైటం, తాటి, గుడిచెట్టు వంటివి అధికంగా ఉన్నాయి. భవిష్యత్‌లో అన్ని పూలు, పండ్ల మొక్కలే నాటాలని నిర్ణయించారు.


హెచ్‌సీయూలో మొక్కలు నాటేందుకు సిద్ధమైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు